సమస్యలు దశల వారీగా పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ ఖాశింబీ

రాచర్ల: మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ సమస్యలను మండల అధికారులు దశల వారీగా పరిష్కరించాలని ఎంపీపీ షేక్ ఖాశింబీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించడంతో పూర్తిగా విఫలమవుతున్నారని, లంచాలు లేనిదే ఏ ఒక్క పనీ ముందుకు సాగడం లేదని సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్‌తో పాటు కాలువపల్లె సర్పంచ్ మీనిగ నారాయణమ్మ, అనుములపల్లె ఎంపీటీసీ యేలం రాజేశ్వరి కొంత సమయం వరకూ నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కాలువపల్లె జగనన్న కాలనీలో కరెంటు సరఫరా విద్యుత్ అధికారులు ఇవ్వడం లేదని కాలువపల్లె సర్పంచ్ మీనిగ నారాయణమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. సత్యవోలులో ట్రాన్స్‌ఫార్మర్ సక్రమంగా లేకపోవడంతో నివాస గృహాల్లోకి రెండు ఫేసులు కరెంటు సరఫర కావడంతో గృహ పరికరాలు కాలిపోతున్నాయని సత్యవోలు సర్పంచ్ బాలీశ్వరమ్మ సభలో మాట్లాడి అనంతరం అర్జీ అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు అడిగే వివిధ సమస్యలను అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ పగడాల దేవి, వైస్ ఎంపీపీ చిట్టెం ఎలీశమ్మ, ఎంపీడీవో కె.కవితా చౌదరి, తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, ఎంఈవో గిరిధర్‌శర్మ పాల్గొన్నారు.

ధరలు ధడేల్!

- బాణసంచా ధరల రెట్టింపు
- వెనుకంజ వేస్తున్న వినియోగదారులు



మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో దీపావళి టపాసులు.. ముట్టించకముందే పేలిపోతున్నాయి. తమిళనాడులోని శివకాశి నుంచి టపాసులు దిగుమతి అవుతుంటాయి. అయితే గతఏడాది కంటే ఈఏడాది ధరలు 30 శాతం మేర పెరిగాయి. రంగులహరివిల్లు కురిపించే టపాసుల ధరల దెబ్బకు ప్రజలు వెనుకంజ వేయాల్సి వస్తోంది. ఆదివారం దీపావళి పండుగ నేపథ్యంలో మార్కాపురం పట్టణంలో దాదాపు 19 షాపుల్లో బాణసంచా విక్రయించేందుకు అధికారులు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశారు. ముఖ్యంగా చిన్నారులు టపాసులు కొనుగోలు చేసి ఆనందంగా గడుపుతారు. మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో సుమారుగా 30 షాపులు ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 20 నుంచి 30 శాతం రేట్లు పెరిగాయి. ధరలు ఇలా ఏటేటా పెరిగిపోవటంతో పిల్లల ఆనందం ఎలా ఉన్నా, పెద్దలు మాత్రం హడలిపోతున్నారు. అసలే పెరిగిన ధరలతో వినియోగదారులు అల్లాడుతుంటే ఇదీ చాలదనట్లుగా జీఎస్టీ తోడు కావటంతో ప్రజల ఆనందం కొద్దిగా తగ్గించుకుని టపాసులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న టపాసులు

అనధికారికంగా విక్రయిస్తే కఠిన చర్యలు:



దీపావళి సందర్భంగా టపాసులు అనధికారికంగా అమ్మినా, గోడౌన్లలో నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటాం. షాపుల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఇసుక, నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి, ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్, పోలీసులకు సమాచారం అందించాలి. అగ్ని ప్రమాదాలు అవకాశం ఉన్నందున కాల్చేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలి.

–సీఐ భీమానాయక్

టపాసుల ధరలు ఇలా..

	గత ఏడాది ధర (రూ)	ప్రస్తుత ధర (రూ)
కాకర పుల్లలు బాక్స్	950	1200
చిచ్చుబుడ్ల బాక్స్	200	280
లక్ష్మీ బాంబులు బాక్స్ చిన్నది	250	350
లక్ష్మీ బాంబులు బాక్స్ పెద్దది	350	450
ఫ్లవర్ ఆటమ్ బాక్స్	130	200
వంకాయ బాంబ్‌లు	150	200
100 వాలా	35	60
1000 వాలా	180	200
10000 వాలా	2500	2800
రాకెట్స్ బాక్స్	300	400
భూచక్రాలు బాక్సు	130	190
మతాబులు బాక్స్	90	150

ఉద్యోగం పేరుతో రూ. 8.6 లక్షలు టోకరా

అద్దంకి రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద నగదు తీసుకుని వారిని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మద్దిపాడు మండలం ఇనుమనమెల్లూరు గ్రామానికి చెందిన మందా నాగరాజు రైల్వేలో లోక్ పైలెట్‌గా పనిచేస్తుంటానని చెప్పాడు. అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన బండారు నాగరాజు మరో ఇద్దరికి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానాని నమ్మించి వారి నుంచి రూ. 8.6 లక్షలు నగదు తీసుకున్నాడు. ఎంత కాలానికి ఉద్యోగాలు ఇప్పించకపోవటంతో మోసపోయానని గమనించిన మందా నాగరాజు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోంగార్డుపై కేసు

మార్కాపురం: పట్టణంలో నివాసముంటూ దర్శి డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్న తనపై త్రిపురాంతకం పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రమణ దాడి చేశాడని అశోక్ ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. వీరిద్దరూ ఇటీవల ఒక విషయంలో గొడవ పడటంతో కానిస్టేబుల్ అశోక్ గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం ఫిర్యాదు చేశాడు.

బాలినేనిపై అసత్య ప్రచారం తగదు

- దామచర్ల ముడుపులు తీసుకొని బాలినేనిపై నిందలు
- చేసిన అభివృద్ధి చెప్పుకొని జనాల్లో వెళ్ళాలే తప్ప విమర్శలు ఎందుకు?
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వెళితే బూతులు తిడతావా?
- టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్లపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నేతలు


మాట్లాడుతున్న తమ్మినేని మాధవి, బొమ్మినేని మురళి, కొమ్మూరి రవిచంద్ర

ఒంగోలు సబర్బన్: ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డిపై పదే పదే అసత్యాలు మాట్లాడటం మానుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వైఎస్సార్‌సీపీ ఒంగోలు నగర 2, 3 క్లస్టర్ కన్వీనర్లు కొమ్మూరి రవిచంద్ర, బొమ్మినేని మురళి మాట్లాడారు. టీడీపీలో దామచర్ల తీరు నచ్చక పార్టీ వీడి వైఎస్సార్ సీపీలో చేరితే బూతులు తిడతావా అని ప్రశ్నించారు. సంవత్సరాల తరబడి పార్టీకోసం పనిచేస్తే పట్టించుకోకపోవడంతో.. వైఎస్సార్ సీపీ విధానాలు నచ్చి, నమ్ముకున్న వాళ్ళను అక్కున చేర్చుకునే మనస్తత్వం కలిగిన బాలినేని శ్రీనివాస రెడ్డి వద్దకు వచ్చి పార్టీలో చేరామన్నారు. మీ పార్టీ నాయకుడు చంద్రబాబు కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి రాలేదా అని ప్రశ్నించారు. బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి గురించి పదేపదే మాట్లాడుతున్నావని.. అది ఆగిపోవటానికి కారకుడివి నువ్వే కదా దామచర్ల అంటూ ప్రశ్నించారు. విజయవాడకు చెందిన కాంట్రాక్టర్‌కు పని అప్పగించింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. 2018 నవంబర్లో బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జికి అనుమతులు వచ్చాయని, అంచనాలు పెంచి కేంద్ర ప్రభుత్వం రూ.20.50 కోట్లకు మంజూరు చేశారన్నారు. అయితే 2019 ఏప్రిల్‌లో అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయన్నారు. అంటే 5 నెలల్లో బ్రిడ్జి పనులను 80 శాతం పూర్తి చేశావా అంటూ నిలదీశారు. బ్రిడ్జి పనులు చేపట్టిన విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ వద్ద ఏ1 కాంట్రాక్టర్‌కు, డెయిరీ చైర్మన్‌ను మధ్యవర్తిగా పెట్టి అతని వద్ద ముడుపులు తీసుకోలేదా అని ప్రశ్నించారు. బాలినేని పర్సెంటేజీలు తీసుకొనే మనస్తత్వం కాదన.. వాళ్ళది రాజకీయ కుటుంబం అని తెలుసుకోవాలన్నారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతనే బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి పనులు వేగంగా జరిగాయని గుర్తు చేశారు. నిధులు లేకపోతే బాలినేనివి సొంత నిధులు రూ.40 లక్షలు ఖర్చు చేసిమరీ పనులు చేయిస్తే లేనిపోని ఆరోపణలు చేయటం మానుకోవాలని హితవు పలికారు. కొత్త పట్నం రోడ్డు, కర్నూలు రోడ్లు వేశాను అని చెబుతూ ఉంటావు కదా, ఆ పనుల్లో నాణ్యత లేదని మీ ఈనాడులోనే ఎన్నో కథనాలు రాస్తే ఆ విలేకరిని పిలిపించుకొని సెటిల్ చేసుకోలేదా అని నిలదీశారు. సూరారెడ్డి పాలెం–రాజు పాలెం రోడ్డును వేయించానంటావు ఆ రోడ్డును 2013–14 సంవత్సరంలో బాలినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసింది కాదా? అని ప్రశ్నించారు. రిమ్స్‌ను మంజూరు చేయించిందే బాలినేని అని, వందల కోట్లు తీసుకొచ్చి జిల్లా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది ఎవరన్నారు. కరోనా వస్తే ఒంగోలు వదిలి పారిపోయిన నీకు ప్రజల కష్టాలు తెలుసా అని ప్రశ్నించారు. జీజీహెచ్‌లో బాలినేని సొంత నిధులతో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసి, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు ఇచ్చి కరోనాతో బాధపడిన వేలాది మందిని ఆదుకున్నదెవరన్నది మరిచి పోయావా అని ప్రశ్నించారు.

బెల్ట్‌షాపులపై దాడులు

- 161 కేసులు.. 226 మంది అరెస్టు
- 497 లీటర్ల డ్యూటీఫైడ్ మద్యం, 89 లీటర్ల బీర్లు స్వాధీనం
- 19 టూవీలర్లు, కారు సీజ్
- సెబ్ ఏఈఎస్ దేవదత్తు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న దేవదత్తు

మార్కాపురం: బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈఎస్ దేవదత్తు, సీఐ రాగమయి హెచ్చరించారు. గురువారం గురువారం విలేకరులతో కేసుల వివరాలు వెల్లడించారు. మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో పరిధిలోని మార్కాపురం, యర్రగొండపాలెం, కంభం, గిద్దలూరు, కనిగిరి సెబ్ స్టేషన్లలోని గ్రామాల్లో ఇటీవల బెల్టుషాపులపై అధికారులు దాడులు నిర్వహించారన్నారు. 161 కేసుల్లో 226 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 497 లీటర్ల డ్యూటీ ఫైడ్ మద్యం 89 లీటర్ల బీర్లు స్వాధీనం చేసుకొని, 19 టూవీలర్లు, ఒక కారును సీజ్ చేసినట్లు చెప్పారు. పొరుగు రాష్ట్రాల నుంచి లిక్కర్ తీసుకొస్తున్నవారు, డిఫెన్స్ లిక్కర్ అమ్మేవారిపై నిఘాపెట్టి 19 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈకేసుల్లో 34 మందిని అరెస్టుచేసి 390 లీటర్ల పొరుగు రాష్ట్రాల మద్యం, 5 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటికి సంబంధించి 7 ద్విచక్రవాహనాలను, కారును సీజ్ చేసినట్లు తెలిపారు. నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 54 కేసుల్లో 94 మందిని అరెస్టుచేసి, 202 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 12,705 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. వీటికి సంబంధించి 5 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

గంజాయి సాగు చేస్తున్న 20 మంది అరెస్ట్

నల్లమల అటవీ ప్రాంతంతోపాటు పట్టణ ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్న వారిపై నిఘాపెట్టి 8 కేసుల్లో 20 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11 కేజీల గంజాయి, 91 గంజాయి మొక్కలు, 2 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. 1230 మంది పాతనేరస్తులు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో కొంతమంది బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ. 8.97 లక్షల నగదును జరిమానా కట్టించామన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో నాటుసారా, గంజాయి, బెల్టు షాపులు, పేకాటపై నిఘాపెట్టామని, ఎవరికైనా సమాచారం తెలిస్తే 9440902499 నంబరుకు తెలపాలని, వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ


క్షతగాత్రులను 108లో మార్కాపురం తరలిస్తున్న సిబ్బంది


వైద్యశాలలో చికిత్సపొందుతున్న క్షతగాత్రురాలు

- పలువురికి గాయాలు

అర్థవీడు(కంభం): కంభం ప్రభుత్వ వైద్యశాల వద్ద ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామంలో గత మూడు రోజుల కోడి గురించి జరిగిన ఘర్షణ ఆ తర్వాత సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో తిరిగి గురువారం సాయంత్రం మరోమారు ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. కొందరికి గాయాలు కాగా వారిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే వారు వైద్యశాలకు వచ్చిన సమయంలో వైద్యశాల బయట మరోసారి ఘర్షణకు దిగడంతో సుమారు 9 మందికి గాయాలయ్యాయి. మీనిగ కాశమ్మ, శ్రీనివాసులు, రమణయ్య, లక్ష్మి, వెంకటేశ్వర్లు, శోభ, మరో వర్గానికి చెందిన చిన్న అల్లూరయ్య, పెద్ద అల్లూరయ్య, సాలమ్మకు కంభం ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ముప్వల శ్రీహరికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కళాశాల కమిటీ సభ్యులు

పొదిలి: పొదిలి ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతో ముందు చూపుతో కృషి చేసిన ముప్వల శ్రీహరి చేసిన సేవలు మరువలేనివని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జీసీ సుబ్బారావు కొనియాడారు. డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుడు శ్రీహరి జయంతి గురువారం జరిగింది. కళాశాలలోని శ్రీహరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మానవత సంస్థ కమిటీ సభ్యులు ముప్వల పార్థసారథి, కె.యల్లమందారెడ్డి, కాటూరి వెంకట నారాయణ బాబు, మాగులూరి రామయ్య, కల్లం సుబ్బారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసులు, సామంతపూడి నాగేశ్వరరావు, సోమిశెట్టి చిరంజీవి, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, తానికొండ వెంకటరావు పాల్గొన్నారు.

సకల దీక్ష స్వాములకు అన్నదానం


భోజనాలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో సకల దీక్ష స్వాములకు అన్నదానం గురువారం ప్రారంభించారు. శ్రీనిర్మమహేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ప్రతి సంవత్సరం నిర్వహించినట్లుగానే ఈ సంవత్సరం కూడా అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 50 రోజుల పాటు అన్నదానం ఉంటుందన్నారు. అన్నదానం చేసేందుకు దాతలు తమ పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలని కోరారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా పింగళి

అయ్యప్ప సేవా సమితి సోషల్ మీడియా కన్వీనర్‌గా, సీనియర్ జర్నలిస్టు పింగళి భానుచందర్ ఎంపికయ్యారు. దైవ సేవతో పాటు భక్తుల సేవలు చేసే అవకాశం వచ్చిందని, పదవికి ఎంపిక చేసిన అందరికి భానుచందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రదాన అర్చకులు మురళి, వాసు, గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్ రావు, గొలమారి చెన్నారెడ్డి, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సకల దీక్ష స్వాములు పాల్గొన్నారు.

పిడతల రంగారెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయికల్పనారెడ్డి

గిద్దలూరు రూరల్: మాజీ ఆర్థిక శాఖ మంత్రి పిడతల రంగారెడ్డి 106వ జయంతి సందర్భంగా స్థానిక పీఆర్ కాలనీ సమీపంలోని ఆయన స్మారక మందిరంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిద్దలూరు అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు తెచ్చుకున్న ఏకైక నాయకుడు పిడతల రంగారెడ్డి అని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలని కోరారు. ఆమె వెంట కుమారుడు అభిషేక్‌రెడ్డి, శ్రీ వివేకానంద విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పోలిరెడ్డి, మురళీకృష్ణ, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కైపు వెంకట కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని పసుపుగల్లు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు.

రబీ సాగులో మెళకువలు పాటించాలి



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి: రబీసాగులో మెళకువలు పాటించాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం కేవీకేలో వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు సరైన సమయంలో సాంకేతిక సలహాలు ఇవ్వాలని సూచించారు. శాస్త్రవేత్తలు వెంకటేశ్వర రెడ్డి, జాహ్నవి, శివ, ఆదిలక్ష్మి, ప్రమీలారాణి పలు అంశాల గురించి వివరించారు. ఏడీఏ కే బాలాజీనాయక్, వ్యవసాయాధికారులు షేక్ జైనలాబ్దిన్, ఎస్.లక్ష్మీనారాయణ, బి.ప్రసాదరావు, ఎండీ ఫారుఖ్, కే ప్రసన్నరంగలక్ష్మి, సీహెచ్ వెంకటేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ హార్టీకల్చర్ సహాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలి

ముండ్లమూరు: గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తహసీల్దార్ నయీం అహ్మద్ సూచించారు. మండలంలోని వేములబండలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో సంబంధిత పొలాలకు చెందిన రైతులు ఉండేలా చూడాలన్నారు. వారి మధ్య సమన్వయం ఉండేలా చూడాలన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ స్రవంతి, మండల సర్వేయర్ విష్ణువర్ధన్, వీఆర్‌ఓ జాన్‌లిపి, సచివాలయ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

చెకుముకి టెస్టు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లి ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన పాఠశాల స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్‌ను జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు డాక్టర్ టంగుటూరి సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ ఆవిష్కరించారు. ఇప్పటి వరకు 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు 200 మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

గిద్దలూరు రూరల్: కార్తీక మాసంలో ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీక మాసంలో ప్రతి ఆదివారం పంచారామాలకు డిపో నుంచి ప్రత్యేక బస్సు వెళ్లనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఒక్కొక్కరికి రూ.2200 చొప్పున టిక్కెట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు రూ.2500 చొప్పున ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

ఎమ్మెల్యే కేపీ సొంత నిధులతో బోర్లు

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన సొంత నిధులతో గురువారం ఉదయం 10 లక్షల రూపాయల వ్యయంతో గ్రామంలో 5 తాగునీటి బోర్లు వేయించారు. మాజీ జెడ్పీటీసీ జవ్వాజి వెంకటరంగారెడ్డి ఆధ్వర్యంలో బోర్లు ఏర్పాటు చేశారు.

ఆర్ఆర్ యాక్ట్‌తో నోటీసులు

త్రిపురాంతకం: జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి అవకతవకలకు పాల్పడిన సిబ్బందికి ఆర్ఆర్ యాక్ట్ ద్వారా రికవరీ కోసం నోటీసులు పంపినట్లు ఎంపీడీఓ సాంబశివరావు, ఏపీఓ సుజాత తెలిపారు. మండలంలో 2013 నుంచి 2017 సంవత్సరం వరకు పని చేసిన ఉపాధి హామి సిబ్బంది అప్పట్లో అవకతవకలకు పాల్పడినట్లు సోషల్ ఆడిట్ ద్వారా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలో 60 మంది సిబ్బంది 2.30 కోట్ల రూపాయల అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అవకతవకలకు బాధ్యులైన 60 మందిని అప్పట్లో తొలగించారు. వారికి ఆర్ఆర్ యాక్ట్ ద్వారా నోటీసులు పంపుతున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన వీసీ



డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమీక్షిస్తున్న వీసీ అంజిరెడ్డి

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ అంజిరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పురోగతి చాలా బాగుందని, ఇంకా అభివృద్ధి జరగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప సభకు తరలి రండి

యర్రగొండపాలెం: షెడ్యూల్ కులాల వర్గీకరణ లక్ష్య సాధన కోసం హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప సభకు వేలాదిగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ఆకాంక్ష ఎవరి ద్వారా ఫలిస్తుందో ఆ నాయకుడు, దేశ ప్రధాని నరేంద్ర మోదీ సభలో పాల్గొంటున్నారని, ఆయన వస్తున్న సందర్భంగా మాదిగల ఐక్యత, శక్తి సంకల్పం నిరూపించుకోవాల్సిన అవసరం తమ అందరిపై ఉందన్నారు. డిసెంబర్ రెండో వారంలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాచర్ల: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాచర్ల గ్రంథపాలకుడు కె.శ్రీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ర్యాగింగ్ చేస్తే జైలుకే

మార్కాపురం: కళాశాలల్లో ర్యాగింగ్ చేసిన వారిని జైలుకు పంపుతామని రూరల్ ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వరనాయక్ హెచ్చరించారు. గురువారం డాక్టర్ సామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని, సరదా కోసం ర్యాగింగ్ చేస్తే భవిష్యత్తు జైల్లో గడపాల్సి వస్తుందన్నారు. ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఒక్కసారి కేసు నమోదైతే ఏ ఉద్యోగానికి అర్హుడు కాదని చెప్పారు. అనంతరం విద్యార్థుల ఏఐసీసీఈ ఆన్‌లైన్ అఫిడవిట్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభించారు. కార్యదర్శి విశాల్ మాట్లాడుతూ జార్జి కళాశాల్లో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, కళాశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎస్‌ఐ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గణేష్ నగర్ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రజలు అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైద్యశాల భవనాలు, విలేజీ హెల్త్ క్లీనిక్‌లు వంటి నూతన భవనాల ప్రయోజనాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి విద్యార్థికి అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నూతనంగా 66 వేల మంది వైద్యులను నియమించారన్నారు. ప్రతి రంగంలో ప్రత్యేక దృష్టి సారించి వారికి కావాల్సిన విధంగా పరిపాలనను కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలకు అభివృద్ధి పథకాలపై పూర్తి అవగాహన కల్పించాల్సి బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈశ్వర్‌నాయుడు, నంద్యాల బాలు, శ్రీరాములు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలిచాయని జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం-1లో మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలలకు అతీతంగా పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. బస్టాండ్ ఆవరణలో పార్టీ పతాకం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంపీడీఓ సావిత్రి, మండల ఉపాధ్యక్షుడు డి. ఖాజామీయా, ఎంపీటీసీ సభ్యుడు బాల రంగయ్య, సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్, సచివాలయ సిబ్బంది, జేసీఎస్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ద్వారా అభివృద్ధి-సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరు మద్దతుగా నిలవాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకంలో ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, సచివాలయాల కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు నక్కా చిన్న త్రిపురారెడ్డి, మల్లికార్జున్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నటరాజ్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వారికి అందిన ప్రభుత్వ పథకాల వివరాలు వివరించారు. మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఖాసింపీరా, సర్పంచ్ చిత్తూరి హారిక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, సొసైటీ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల నాయకులు యక్కంటి మల్లారెడ్డి, లాలునాయక్, దూదేకుల రసూల్, బొగ్గరపు రమేష్, రావిక్రింది సుబ్బారావు, మొద్దు తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్ షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు సచివాలయంలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరొక సారి వైఎస్సార్ సీపీ అధికారం కోసం కార్యకర్తలు అహర్నిశలూ కృషి చేయాలని కోరారు. ఈఓఆర్‌డీ నారాయణరెడ్డి, సర్పంచ్ గౌతమి, మండల సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అవసరమని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నారు. గురువారం ఒకటో వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు



గిద్దలూరు: వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు మరింత మంచి చేసేందుకు మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోనికి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముందుగా జువ్విచెట్టు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వార్డులో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ జి. శ్రీనివాసరెడ్డి, వార్డు కౌన్సిలర్ మారెంరెడ్డి లతా కిట్టు, చప్పల్లి కనకదుర్గ, జేసీఎస్ కన్వీనర్లు పత్తి రవిచంద్ర, కమిషనర్ గిరి కుమార్, డీఈ సుభానీ, శివాలయం మాజీ చైర్మన్ రెంటచింతల మధుసూదనశర్మ పాల్గొన్నారు.

పొదిలి రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలని పార్టీ మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి అన్నారు. పొదిలి మండలం తలమళ్లలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించే బోర్డులు ఆవిష్కరించారు. తర్వాత గ్రామ పెద్దలు, పార్టీ నాయకులతో చర్చించి వారి సూచనలు స్వీకరించారు. అనంతరం ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడారు. అనంతరం పార్టీ జెండా ఎగురువేశారు. ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, ఈఓఆర్డీ కృష్ణ, సర్పంచ్ తెల్లమేకల సుబ్బమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.సుబ్బారావు,కంభం మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి శేషగిరి పాల్గొన్నారు.

కంభం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. ఏపీకి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం కందులాపురం-2 సచివాలయంలో ప్రారంభించారు. బుక్‌లెట్‌లు ఆవిష్కరించిన అనంతరం స్థానిక వైజంక్షన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కందులాపురం-2 సచివాలయం పరిధిలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. జెడ్పీటీసీ కొత్తపల్లి జ్యోతి, సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సయ్యద్ సలీం, మహబూబ్ పీరా, డిష్‌బాబు,స బ్బసాని సాంబశివారెడ్డి, కటికల భాస్కర్, శరభారెడ్డి, హుస్సేన్‌బాష పాల్గొన్నారు.

రాచర్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రం రాచర్ల సచివాలయంలో.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాను ఆవిష్కరించారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు పగడాల దేవి, వైస్ ఎంపీపీ చిట్టెం ఎలీశమ్మ, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నేత సూర పాండురంగారెడ్డి, కార్యదర్శి వెంకట్వేరనాయక్ పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొన్నారు. ప్రజలకు మరింత మంచి చేసేందుకు మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు వెంకటరెడ్డి, సర్పంచ్ శిగినం లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ, నోడల్ అధికారి రావూరి జనార్దన్, పంచాయితీ సెక్రటరీ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి తిరిగి ప్రజా అభిప్రాయ సేకరణ చేశారు.

తర్లుపాడు: నూతన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన, ఆరోగ్య సురక్ష ద్వారా గడప వద్దకే మెరుగైన వైద్యం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రం తర్లుపాడు సచివాలయంలో జగనే ఏపీకి ఎందుకు కావాలంటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మనల్ని మనంగా గుర్తించి అర్హులను వెతికి మరీ ఇంటి వద్దకే సంక్షేమం అందిస్తూ మన ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరరావు, సర్పంచ్‌లు పి.వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ, ఏపీఎం పిచ్చయ్య, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీకి సచివాలయం కన్వీనర్లు రామసుబ్బారెడ్డి, ఎబినేజర్, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు డి. పెద్దమస్తాన్, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు రామిరెడ్డి, మీరయ్య, తిరుమల బాలసుబ్బమ్మ, శిఖామణి, తాడి రమణారెడ్డి, రమణయ్య, శారద, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు మందా కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

పల్లె నిద్ర కార్యక్రమంలో నాయకులు

తర్లుపాడులో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మండలంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రజలతో మమేకమై వారితో మాట్లాడారు. బస్సు యాత్ర సందర్భంగా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఎమ్మెల్యేగా కేపీ నాగార్జునరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునివ్వడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించారు.

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సచివాలయం-1లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి గడప గడపకు వెళ్లి సంక్షేమం, అభివృద్ధిపై ప్రచారం చేశారు. అనంతరం పార్టీ నాయకుడు గోళ్ల కృష్ణారావు ఇంట్లో పల్లె నిద్రచేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ఎస్.జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, రైతు సంఘ నాయకుడు వై.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఈవోపీఆర్డీ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ఎస్.పల్లెలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిజం వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలకు మన ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించాలన్నారు. గ్రామంలోని సచివాలయంలో ఎంపీపీ కడప లక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధివిధానాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికారయంత్రాంగం పనిచేయాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు యర్రం వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఓబులరావు, గ్రామ సర్పంచి ఎలిజబెత్తు, ఎంపీటీసీ వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పులి రామకృష్ణారెడ్డి, లక్ష్మీరెడ్డి, ఈఓఆర్డీ చెన్నారావు పాల్గొన్నారు.



తర్లుపాడులో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పుల్లలచెరువు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో కూడా ముఖ్యమంత్రిగా ఎన్నుకునే విధంగా అందరూ కృషి చేయాలని మండల పార్టీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి కోరారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో నోడల్ అధికారి శరత్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ వెంకటయ్య, జెడ్పీటీసీ వాగ్యానాయక్ మాట్లాడారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. గడప గడపకు వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలు వివరించి బుక్‌లెట్లు అందజేశారు. రాత్రి పుల్లలచెరువులో వైఎస్సార్ నాయకులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టరు. ఎంపీటీసీ రాములు, ఎంపీడీవో మరియదాసు, కార్యదర్శి బాలునాయక్, మంత్రి సురేష్ పీఏర్వో జంకా శ్రీనివాసరావు, పీపీఎస్ డైరెక్టర్ రఘు, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఎంఎల్ఓ వాసు, నాయకులు కాశయ్య, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలి

● దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: రాష్ట్రం బాగుండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ స్పష్టం చేశారు. గురువారం దర్శి మండలంలోని దర్శి సచివాలయం-1, బొట్లపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మళ్లీ ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమాలు నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే మద్దిశెట్టి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, నాడు-నేడు ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన లిస్టు బోర్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు అమలు చేసేవారే కావాలన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా మేనిఫెస్టోనే మాయం చేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని, ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట తప్పని మడమ తిప్పని నేత అని కొనియాడారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. టీడీపీ హయాంలో నెలలో ఎన్నికలు వస్తాయనగా రూ.1000 పింఛన్‌ను రూ.2 వేలు చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రెండు వేలు ఉన్న పింఛన్‌ను పెంచుకుంటూ ఇప్పుడు రూ.2,750 ఇస్తున్నారని, జనవరి నుంచి రూ.3 వేలు ఇస్తారని చెప్పారు. గ్రామాల్లో సచివాలయాల వ్యవస్థ ద్వారా సమస్యలు అక్కడే పరిష్కారం అవుతున్నాయన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేశాయన్నారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో జగన్ తీసుకున్న నిర్ణయాలు ఇతర రాష్ట్రాల ప్రశంసలు సైతం అందుకున్నాయని గుర్తుచేశారు. చింతలపాలెంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధా అచ్చయ్య, నగర పంచాయతీ కమిషనర్ మహేష్, ఎంపీపీ కుసుమకుమారి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, వీసీ రెడ్డి, తుళ్లూరి బాబూరావు, జగన్నాథం మోహన్‌బాబు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, సర్పంచ్‌లు రాము, సుబ్బారెడ్డి, కర్ణా భాస్కర్‌రెడ్డి, మజ్జువలి, గంజి వెంకటేశ్వరరెడ్డి, కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, రామకృష్ణ, పుట్ట రవి, కొండలు, యలమందారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో అభివృద్ధి డిసిప్లేను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కురిచేడులో...

కురిచేడు: స్థానిక 1వ సచివాలయంలో సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య అధ్యక్షతన గురువారం మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఎంపీడీఓ బి.శంకర రావు, ఈఓఆర్డీ ప్రసాదరావు, జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్ సైదా, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, మేరువ పిచ్చిరెడ్డి, బి.సురేష్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, సొసైటీ ప్రెసిడెంట్ పోతిరెడ్డి నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ కొలారి నరసింహ పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు (ముండ్లమూరు): స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన ఏపీకి జగనే మళ్లీ సీఎం ఎందుకు కావాలనే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా సచివాలయం పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, సొసైటీ అధ్యక్షుడు యాడిక యలమందారెడ్డి, కుమ్మిత జయరామిరెడ్డి, ఎంపీడీఓ కె.యుగకీర్తి, తహసీల్దార్ కె.వి.ప్రసాద్, ఎంఈఓ సుబ్బయ్య, ఈఓఆర్డీ రాజు, ఏపీఎం దేవ రాజ్, ఏఓ ప్రసాదరావు, సర్పంచ్‌లు నాగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వలి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాదరెడ్డి, విష్ణు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వై.పాలెంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దొనకొండ (కురిచేడు): స్థానిక గ్రామ సచివాలయ ప్రాంగణంలో గురువారం సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలనే కార్యక్రమానికి ఎంపీపీ ఉషారాణి మురళి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. ఎంపీడీఓ వసంతరావునాయక్, జెడ్పీటీసీ సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ జి.పోలయ్య, వైస్ ఎంపీపీ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కన్వీనరు శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనరు నారపురెడ్డి, ఎంఎల్ఓ మార్టిన్, అధికారులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరినట్లు జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ రత్నరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సచివాలయం పరిధిలో లబ్ధిపొందిన వారి వివరాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర రెడ్డి, నాయకులు పాలెపోగు డగ్లస్, అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, తాతపూడి శాంతకుమార్, అంబటి వెంకటేశ్వరరెడ్డి లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచితంగా న్యాయసేవలు పొందొచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ న్యాయ సహాయం పొందాలనే ఉద్దేశంతో 1985లో లీగల్ సర్వీస్ చట్టం తెచ్చారన్నారు. ఈ చట్టంతో ఉచితంగా న్యాయవాదిని, న్యాయ సహాయం పొందవచ్చని, లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ యాసిన్‌బాషా, న్యాయవాదులు రవిప్రకాష్, కటారు పోలయ్య, పిచ్చయ్య యాదవ్, పారా లీగల్ వలంటరీ మధు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సరస్వతి

చట్టాల గురించి తెలుసుకుంటే నేరాలు జరగవు

దర్శి: చట్టాల గురించి చిన్నతనంలోనే తెలుసుకుంటే నేరాలు జరగవని జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. స్థానిక బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హాస్టల్ విద్యార్థుల వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి వండిన ఆహార పదార్థాలు, స్టోర్ రూంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ నిజాయితీగా ఉండే వారు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాకా మంజుల, వార్డెన్ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: మండలంలోని కొండేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రతిభను తెలుసుకునేందుకు ఉపాధ్యాయుడుగా మారి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అర్థవంతంగా పాఠాలు బోధిస్తూ వారి అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తన సొంత గ్రామంలో ఉన్న యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అభివృద్ధి చెందేందుకు తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటకూరి భారతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు బైరెడ్డి వెంకటరెడ్డి, పాట్టి ప్రసాద్, వైదేహి, శ్రీనివాస్ ఉన్నారు.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి